## క్లుప్తంగా

### 7న పర్ణశాల ఆలయం మూసివేత

దుమ్ముగూడెం: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ఈ నెల 7వ తేదీన పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మూసి వేయనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయాన్ని మధ్యాహ్నం 1 గంటకు ఆలయ తలుపులు మూసి.. తిరిగి వరుసటి రోజు 8వ తేదీన తెల్లవారుజామున 4 గంటలకు తెరవనున్నట్లు తెలిపారు. ఆపై ఆలయ సంప్రోక్షణ, శుద్ధి, సేవా కాలం నిత్య ఆరాధన నైవేద్యం తదితర కార్యక్రమాలు పూర్తి చేసి యథావిధిగా ఉదయం 7:30 గంటల నుంచి స్వామివారి దర్శనం భక్తులకు కల్పించనున్నట్లు వెల్లడించారు.

### పాఠశాలల సందర్శన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మామిళ్లవారిగూడెం, ఆసుపాక, నారాయణపురం, గుమ్మడవల్లితోపాటు పలు పాఠశాలలను సోమవారం స్థానిక ఎంపీడీఓ అప్పారావు సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని మౌలిక సదుపాయాలు, తరగతి గదులతోపాటు మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అలాగే మామిళ్లవారిగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తన సొంత ఖర్చులతోపాటు దాతల సాయంతో విద్యార్థులకు టై, బెల్టు, పాఠశాల పేరుతో ఉన్న లోగో బ్యాడ్జీలను ఎంపీడీఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్‌రావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ మల్లేష్ పాల్గొన్నారు.

### భద్రాద్రి క్రీడాకారుల ప్రతిభ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి చెందిన ముగ్గురు అండర్–14 క్రికెటర్లు హెచ్‌సీఏ హైదరాబాద్ క్రికెట్ లీగ్స్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి తమ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో ప్రసన్న కుమార్, బౌలింగ్లో చంద్ర, ప్రేమ్ సింగ్‌లు ప్రతిభ కనబరిచి జట్టు విజయాన్ని సులభతరం చేశాడు. ఈ ముగ్గురు క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన శరణ్ తేజను పలువురు అభినందించారు.

### కార్మిక సంఘం ఏర్పాటు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పోరాటానికి నవోదయ కాంట్రాక్ట్ కార్మిక సంఘాన్ని (ఈ–2221)ను ఏర్పాటు చేశారు. సోమవారం ఐటీసీ గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) శ్యామ్‌కిరణ్‌ను కలిసి నవోదయ కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యవర్గ వివరాలను, రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. సంఘం అధ్యక్షుడిగా మదమంచి నిరంజన్ సతీష్, ప్రధాన కార్యదర్శిగా బూసిరెడ్డి రామకోటిరెడ్డి, మరో 24 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా గళ్ల నాగభూషయ్యను నియమించారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి గాదె రామకోటిరెడ్డి, టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు పాల్గొన్నారు.

### విద్యార్థికి ప్రోత్సాహకం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదువుతూ క్రీడాల్లో రాణిస్తున్న విద్యార్థికి సోమవారం ప్రతిభ ప్రోత్సహకాన్ని అందజేశారు. పాఠశాలలో చదువుతున్న పృథ్వీ క్రీడల్లో రాణిస్తుండడంతో అతనికి రూ.3 వేల ప్రోత్సాహక బహుమతిని స్థానిక గాదె మాధవరెడ్డి అందజేశారు. అనంతరం 6వ తరగతి నుంచి టెన్త్ వరకు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధిస్తున్న విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ బ్యాడ్జీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.రమ, ఉపాధ్యాయురాలు పద్మ పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి

ములకలపల్లి: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు గండిపడ్డ మాధారం ఎర్ర చెరువు, పూసుగూడెం శివారు తెల్లవాగు చెరువు పరిసర ప్రాంతాలను పార్టీ బృందం సోమవారం పరిశీలించి వారిని ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

### క్రీడా పోటీలు ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన పాఠశాలల మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండోరోజు మంగళవారంతో పోటీలు ముగుస్తాయని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### 11న కేటీఆర్ పర్యటన

దుమ్ముగూడెం: భద్రాచలంలో ఈ నెల 11వ తేదీన జరిగే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోకన్వీనర్ జానీపాషా, నాయకులు మల్లేశ్వరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# సారొస్తేనే నిర్మాణం సాగేది..

- బెండాలపాడు ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు రానున్న సీఎం
- అశ్వారావుపేట రహదారి పనుల యంత్రాలన్నీ అక్కడికే..
- సీఎం వస్తేనే యంత్రాలు తిరిగొచ్చేది.. రోడ్డు పనులు సాగేది..
- ఈ లోగా దుమ్ము, బురదతో స్థానికుల అవస్థలు


నిర్మాణంలో ఉన్న రహదారిపై లేస్తున్న దుమ్ము

అశ్వారావుపేట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రుగొండ మండలం బెండాలపాడు పర్యటను ఈ సారైనా పూర్తి కావాలని అశ్వారావుపేట మున్సిపాలిటీ ప్రజలు కోరుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం కోసం సీఎం రేవంత్ రెడ్డి చంద్రుగొండ మండలం బెండాలపాడులో గత నెల 21న వస్తారని తొలి ప్రకటన చేశారు. ఆ తర్వాత 30కి వాయిదా వేశారు. ఆ తర్వాత ప్రస్తుతం ఈనెల 3న సీఎం వస్తారని తిరిగి ప్రకటించారు. ముచ్చటగా మూడో ప్రకటన అయినా విజయవంతం కావాలని అశ్వారావుపేట మున్సిపాలిటీ ప్రజలు పార్టీలకతీతంగా మనసారా కోరుకుంటున్నారు.

**బెండాలపాడుకు యంత్రాలు..**
**అశ్వారావుపేటలో తంటాలు**

నియోజకర్గంలోని మారుమూలు గ్రామం బెండాలపాడుకు సీఎం వచ్చి వెళ్తే ముందు స్వేచ్ఛా వాయువులను పీల్చుకునేది అశ్వారావుపేట వాసులే. ఎందుకంటే ఇక్కడ నెల రోజుల క్రితం ప్రారంభం అయిన రహదారి విస్తరణ పనులు స్వాతంత్ర దినోత్సవం సాక్షిగా ఆగిపోయాయి. నియోజకవర్గానికి సీఎం వస్తున్నారని.. ఈ నెల 15 నుంచి అధికార యంత్రాంగంతోపాటు రహదారి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ యంత్రాలు, భారీ వాహనాలు, డోజర్లు, గ్రేడర్ అంతా బెండాలపాడుకు తరలింది. ఇంకేముంది ఉన్న బీటీని తవ్వేసి బూడిద, రాళ్ల వెట్ మిక్స్‌ను పోసి వదిలేశారు. సరిగా క్యూరింగ్ కూడా లేక దుమ్మురేగి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఏదోలా సీఎం పర్యటన పూర్తయితే గానీ యంత్రాలు, యంత్రాంగం అశ్వారావుపేటకు వచ్చే పరిస్థితి లేదు.

**రోడ్డు వేసేందుకు నెల రోజులా?**

రోడ్డు వేయడం సంత్సరాలు తరబడి చేసే పనేం కాదు. నేలను చదును చేశామా.. వెట్‌మిక్స్ పరిచామా.. రోలింగ్ చేశామా.. బీటీ పరిచి రోలింగ్ చేశామా? అంతే రోడ్డు నిర్మాణం అయిపోయినట్లే. ఇదందరికీ తెలిసిన సంగతే. అయితే అశ్వారావుపేట బీటీ రోడ్డు మాత్రం నెల రోజులు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. గుంతలున్న అశ్వారావుపేట–ఖమ్మం రహదారికి స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కొత్త రోడ్డు వేసేందుకు రూ.3కోట్లు మంజూరు సాధించారు. ఆగస్టు 3న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయ కొట్టి స్వయంగా ఆయనే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారం రోజుల్లో రింగ్ సెంటర్ నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు బీటీ రహదారి సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు. కట్ చేస్తే.. నేటికి నెల రోజులయింది. పరచిన వెట్‌మిక్స్‌కు వరుణ దేవుడే వాటరింగ్ చేయాల్సి వస్తోంది. దుమ్ము లేస్తూ అశ్వారావుపేట మున్సిపాలిటీ వ్యాప్తంగా ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే మాత్రం రహదారి బురద గుంతవుతోంది. బెండాలపాడుకు తరలిన యంత్రాలు తిరిగొస్తేనే పనులు ముందుకు సాగేది. అందుకే సీఎం సారు కోసం ఎదురుచూడడంలో అశ్వారావుపేట వాసులే ఎక్కువ ఆసక్తితో ఉన్నారు.

**మార్కెట్‌లో తిరగలేకపోతున్నాం..**

అశ్వారావుపేటలో ఏమూల చూసినా దుమ్ము పేరుకుపోయింది. రోడ్డు పనుల కారణంగా దుమ్ము ఊరంతా పడుతోంది. ఎన్నాళ్లు ఈ బాధ భరించాలో అర్థం కావడం లేదు. బతుకుదెరువు కోసం మార్కెట్‌కు వెళ్తే దుమ్ము బాధ తప్పడం లేదు.
– దుర్గారావు, చేపల వ్యాపారి

**వ్యాపారం సాగడం లేదు..**

డ్రెయినేజీ, డివైడర్ పనులు మొదలు పెట్టి ఏడాది దాటింది. ఎక్కడికక్కడ గుంతలు తవ్వేసి నెలల తరబడి పనులు నిలిపేస్తున్నారు. కొన్ని రోజుల పాటు కూరగాయల దుకాణం మూసి వేశాం. తెరిచినా వ్యాపారం ఉండటం లేదు.
– మైనం రాజేష్, కూరగాయల వ్యాపారి

**సీఎం సభ పూర్తవగానే పనులు**

వెట్‌మిక్స్ పనులు జరుగుతున్నాయి. వర్షాలకు క్యూరింగ్ మంచిగానే అవుతోంది. ఆలస్యం అయినా.. రోడ్డు గట్టిగా తయారవుతుంది. యంత్రాలు బెండాలపాడులో వాడుతున్నాం. సమావేశం పూర్తి కాగానే పనులు కొనసాగిస్తాం.
– ప్రకాశ్, ఆర్‌అండ్‌బీ డీఈఈ

# కాళేశ్వరంపై ప్రభుత్వ నిర్ణయం సరికాదు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా, నాయకులు

మణుగూరురూరల్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరైనవి కావని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఘోష్ కమిటీని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రేగా సారథ్యంలో నాయకులు, కార్యకర్తలు నల్లజెండాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ భవన్ నుంచి ఆరంభమైన నిరసన ర్యాలీ సురక్షా బస్టాండ్, సినిమాహాల్ సెంటర్, సాయినగర్ మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. అంబేద్కర్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. కోటి ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంగా మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు రూపుదిద్దుకుందన్నారు. దీనిపై ఘోష్ కమిటీ వేసి అబాసుపాలు చేయడం దారుణమన్నారు. అసత్య ప్రచారాలు, ఆరోపణలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, వేర్పుల సురేష్, ఆవుల నర్సింహరావు, అక్కి నర్సింహరావు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గణపతి మండపంలో ఏఎస్పీ పూజలు


మండపం వద్ద పూజలు చేస్తున్న ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

బూర్గంపాడు: సారపాకలోని శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవ మండపంలో సోమవారం భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో దర్శనం అనంతరం మండపంలోని గణపతి విగ్రహం వద్ద పూజలలో పాల్గొన్నారు. అనంతరం మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**లడ్డూ వేలం రూ.70 వేలు**

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో వినాయక చవితి పండుగ సందర్భంగా గణపతి వద్ద ఉంచిన లడ్డూ వేలాన్ని సోమవారం నిర్వహించారు. ఈ వేలం పాటలో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా రూ.70 వేలకు భద్రాచలం ఏడీఈ వేణు బృందం ఈ లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం మేళ తాళాలతో వినాయకుడి నిమజ్జన యాత్ర సాగింది. కార్యక్రమంలో భద్రాచలం విద్యుత్ శాఖ డీఈ జీవన్ కుమార్, ఏఏఓ సత్యనారాయణ, ఏడీఈలు వేణు, ప్రభాకర్, ఏఈలు రాజారావు, ఉపేందర్, మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు వెంకటరాజు, రామకృష్ణ, రమేష్, త్రినాథ్ రెడ్డి, సర్వేశ్వరరావు, డివిజన్ పరిధిలోలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలపై సంతకాల సేకరణ**

బూర్గంపాడు: సారపాక మేజర్ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి సంతకాలను సేకరించారు. అనంతరం సమస్యల వివరాలను, ప్రజల సంతకాలను గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సారపాక మేజర్ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకం వెంకటేశ్వర్లు, ఎస్‌కె.హుస్సేన్, బత్తుల గోపాలరావు, మర్రి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు చేపట్టిన ఈఈ

దమ్మపేట: సాగు నీటి పారుదల శాఖ అశ్వారావుపేట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బి.కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మండలంలోని మందలపల్లి ఈఈ కార్యాలయంలో సోమవారం బాధ్యతలను చేపట్టారు.

### జిల్లా కోఆర్డినేటర్‌గా అరుణ్ రాజ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన చింతిరాల అరుణ్ రాజ్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పలువురు కాంగ్రెస్ నాయకులు అరుణ్‌కు అభినందనలు తెలిపారు.

### ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారంతో భద్రాచలం మండలంలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలను స్థానిక పోలీసులు సోమవారం ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టుల పట్ల ఆశ కార్యకర్తలు తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేసే హక్కు తమకు ఉందని దాన్ని అడ్డుకోవడం సరికాదని వారు వాపోయారు.

# సీపీఎస్‌ను రద్దు చేయాలి



దుమ్ముగూడెం: అర్లగూడెం ఏజీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల నిరసన..

దుమ్ముగూడెం: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాజు, ఏటీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.సత్యనారాయణలు డిమాండ్ చేశారు. సోమవారం రెండు సంఘాల ఆధ్వర్యంలో వేరువేరుగా కార్యక్రమాలను నిర్వహించారు. ఏహెచ్‌ఎస్ అర్లగూడెం పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. అలాగే ఏజీహెచ్‌ఎస్ అర్లగూడెం, ఏజీహెచ్‌ఎస్ మంగ్యాయిబాద్వలో ఏటీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, పాపారావు, కొర్స వెంకటేశ్వర్ రావు, ప్రేమ్ కుమార్, వీరమ్మ, పాయం పార్వతి, శ్రీనివాసరావు, రమేష్, ఆపక పార్వతి, రాజేశ్వరి, కృష్ణకుమారి, భాస్కర్, నాగేశ్వరరావు, రవి, సంగీత, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**టీఎన్‌జీఓల ఆధ్వర్యంలో..**

మణుగూరురూరల్: సెప్టెంబర్ ఒకటో తేదీన పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో టీఎన్‌జీఓస్ ఉద్యోగులు సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు అంటూ నినాదిస్తూ సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులు చేతబూని నిరసనలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన పాత పెన్షన్ విధానం హామీని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు జి.రవి, కృష్ణారావు, శ్రీనివాసరావు, నరసయ్య, వేణుగోపాల్, ఏటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి స్రవంతి

అశ్వారావుపేటరూరల్: పంటలను సాగు చేసే ముందే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ స్రవంతి, డాక్టర్ పి.ఝాన్సీరాణి సూచించారు. సోమవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మండలంలోని మల్లాయిగూడెం రైతు వేదిక భవనంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భూసార పరీక్షలు, పంట పొలాల్లో నీటి కుంటలు, ఇంకుడు గుంతల, నీటి సంరక్షణ, స్ప్రింకర్లు, డ్రిప్ పద్ధతిపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఏఏ పంటలను సాగు చేయాలి అనే అంశాలపై కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రాంప్రసాద్ సూచనలు చేశారు. ఏఓ శివరాం ప్రసాద్, ఏఈఓ సతీష్, షాకిరా భాను, కార్యదర్శి శ్రీకాంత్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నకిలీ ఆర్‌ఎంపీ దుకాణం బంద్

అశ్వారావుపేట: తెలిసీ తెలియని వైద్యం చేసి అమాయకుల ప్రాణాల మీదకి తెస్తున్న ఓ నకిలీ ఆర్‌ఎంపీ గడిచిన మూడ్రోజులుగా దుకాణం బంద్ పెట్టాడట. పలువురి ప్రాణాల మీదకు తెచ్చిన ఆరోపణలను ఎదుర్కొంటున్న ఈ వ్యక్తి డీ ఫార్మసీ కోర్సు పూర్తి చేసి గాంధీబొమ్మ సెంటర్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. మెడికల్ షాపుతోపాటు వైద్యం కూడా చేస్తానని ఆయనే ప్రకటించుకున్నడు. అంతే కాకుండా గాంధీబొమ్మ సెంటర్, ముస్లిం బజారు పరిసర ప్రాంతాల వారు తన వద్దనే చూపించుకోవాలని బెదిరిస్తాడట. అశ్వారావుపేట, పాపిడిగూడెం, కామయ్యపాలెం ప్రాంతాల్లో ఇతని బాధితులున్నట్లు తెలుస్తోంది. గతంలో ఓపాము కాటు కేసులో ఓ మహిళకు సెలైన్లు అమర్చడంతో ఆమె ఖమ్మంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకూ ఇతనే వైద్యం చేశడనే ఆరోపణలున్నాయి. అయినా ఇతణ్ని స్వేచ్ఛగా అధికారులు వదిలేయడం వెనుక ఆంతర్యం పాలుపోక స్థానికులు విస్తుపోతున్నారు.

**మెడికల్ షాపు మాటున ఆస్పత్రుల నిర్వహణ**

కొందరు వ్యక్తులు ఏదేని సైన్స్ గ్రూపులో ఇంటర్మీడియేట్ చదివి డీ.ఫార్మసీ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన తర్వాత మెడికల్ షాపు ప్రారంభిస్తున్నారు. ఆ తర్వాత అక్కడే వెనుకాల గదిలో స్కెతస్కోప్, బీపీ ఆపరేటర్, ఇంజక్షన్లు ఉంచి ఎంబీబీఎస్ డాక్టర్లుగా చెలామణీ అవుతున్నారు. సదరు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి కూడా తాను 2004లో చెన్నైలో డీ ఫార్మసీ చదివానని.. ఆ తర్వాత ఏ కోర్సూ చేయనవసం లేకుండా వైద్యం తెలుసుకుని ప్రాక్టీస్ చేస్తున్నానని చెబుతున్నాడు. ఇదే తరహాలో పలు మెడికల్ షాపుల వెనుకాల అనధికార ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. వీటిలో కొందరు అనుభవజ్ఞ ఆర్‌ఎంపీలు ఉంటున్నా.. చాలా వరకు ఫార్మసిస్టులే డాక్టర్లుగా, సర్జన్ల అవతారం ఎత్తుతున్నారు. ఈ విషయాలను వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లగా.. స్వయంగా తనిఖీ చేయడంతోపాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

### అల్పాహారం పంపిణీ

అశ్వాపురం: లయన్స్‌క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్ ఆధ్వర్యంలో సోమవారం అశ్వాపురం పీహెచ్‌సీ వద్ద ఉచిత అల్పాహార మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని పీడీజీసీహెచ్ శివప్రసాద్, లయన్ లీడర్ ఎడవల్లి కృష్ణ, జడ్పీసీ కురిచేటి శ్రీనివాసరావు ప్రారంభించారు. అశ్వాపురం పీహెచ్‌సీలో 100 మంది రోగులు వారి బంధువులకు బ్రెడ్స్, అరటిపండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్ ప్రెసిడెంట్ నల్లగట్ల సత్యప్రకాష్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ రోజు ఉదయం పీహెచ్‌సీ వద్ద, గ్రామాల్లోని వివిధ ప్రదేశాల్లో ఉచిత అల్పాహారం పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మణుగూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మీరాహుస్సేన్, విజన్ ప్రెసిడెంట్ సురేష్, అశ్వాపురం కొత్త క్లబ్ ప్రెసిడెంట్ సింగం శ్రీధర్, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత పాల్గొన్నారు.

### ఒకే నెలలో 100 ప్రసవాలు


100వ ప్రసవం పూర్తయిన సందర్భంలో వైద్యులు, సిబ్బంది..

మణుగూరుటౌన్: స్థానిక 100 పడకల ఆస్పత్రిలో ఒక్క నెలలోనే 100 ప్రసవాలు విజయవంతంగా జరిగినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. సోమవారం ఆయన ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడుతూ.. 2023 సంవత్సరం సెప్టెంబర్ నెలలో 83 ప్రసవాలు జరగ్గా, ఈ ఏడాది ఆగస్టులో 100 ప్రసవాలు చేసి రికార్డును తిరగరాశామన్నారు. ఈ ఘనత సాధించేందుకు కృషి చేసిన గైనకాలజిస్ట్ పద్మ, ఆర్‌ఎంఓ మూర్తి సాయిమోహన్, ఇతర వైద్యులు అజంతా, ప్రసాద్‌రావు, శ్రీదేవి, సుప్రియ, ప్రణవ్, ఇతర సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### ఆస్పత్రికి సామగ్రి వితరణ


ప్రభుత్వ ఆస్పత్రిలో బెడ్లు అందిస్తున్న సీపీ కంపెనీ ప్రతినిధులు, స్థానికులు

గుండాల: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి సీపీ కంపెనీ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారి మానాల వెంకటేశ్వర్లు సౌజన్యంతో సోమవారం బెడ్స్ అందించారు. 8 బెడ్లు, పరుపులు, 2 సెలూన్ స్టాండ్లు, 2 నెబ్‌లైజర్లు అందించారు. ఆళ్లపల్లి ప్రభుత్వాస్పత్రిలో సైతం ఇవే సామగ్రిని అందించారు. రానున్న కాలంలో సబ్ సెంటర్లకు కావాల్సిన సామగ్రిని అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ చైర్మన్ రాజశేఖర్, ఏఓ వెంకటరమణ, వైద్యాధికారి మనేష్‌రెడ్డి, ఎస్సై సైదా రహూఫ్, మానాల శ్రావన్, మానాల ప్రణీత్, మానాల ఉపేందర్, తావిడిశెట్టి నాగరాజు, రాంబాబు, శ్రీశైలం, నాగమల్లయ్య, పూజిత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవాలి

భద్రాచలంఅర్బన్: గోదావరి వరదల కారణంగా ఉపాధి కోల్పోతున్న కంబాలపాడు ప్రాంతంలోని మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ రాహుల్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఆర్థికంగా ఆదుకుని, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, మత్స్యకారుల శ్రీను, రమణ, గంగా, స్వరూప, సుధా కుమారి పాల్గొన్నారు.

# వరద నీటిలో నెమలిపేట

- కాలువలను తలపిస్తున్న రోడ్లు, చెరువుల్లా ఇళ్ల వాకిళ్లు
- ప్రహరీ లేక పాఠశాలలోకి వరద
- శాశ్వత పరిష్కారానికి స్థానికుల వేడుకోలు


ఓ ఇంటిలోకి చేరిన వరద నీరు


నెమలిపేటలో సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

దమ్మపేట: మండలంలోని దమ్మపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నెమలిపేట గ్రామంలో భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో వరద కాలువ ఉధృతంగా ప్రవహించి, ఇళ్లలోకి వరద నీరు చేరుతోంది. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల సందర్భంతోపాటు తాజాగా ఆది, సోమ వారాల్లో కురిసిన వర్షాలకు సైతం నెమలిపేటలో ఈ పరిస్థితే కనిపించింది. ఇలా ప్రతి సంవత్సరమూ ఇళ్లల్లోకి వరద నీరు వస్తున్నప్పటికీ, ఈ సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపట్లేదు. దీంతో ఈ వరద ముంపు బాధితుల కష్టాలు ఎప్పుడు తీరతాయోనని స్థానికులు తలలు పట్టుకుంటున్నారు.

**నిర్మాణాల్లో లోపాలు..**

నెమలిపేట గ్రామంలో ప్రధాన రాష్ట్రీయ రహదారికి పక్కనే ఉన్న వరద నీటి కాలువ ఉంది. ఈ కాలువకు ఒక పక్కన రహదారి ఉండగా.. మరో పక్క 50 కుటుంబాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. వర్షపాతం అత్యధికంగా సంభవించిన సందర్భాల్లో ఈ వరద కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. కాగా ఈ కాలువ వెడల్పు తక్కువగా ఉండటమే కాక దీనిపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వంతెన కింద భాగం కూడా వెడల్పు తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో పై నుంచి అధికంగా వరదలు వస్తే.. ఆ నీరంతా కాలువ పక్కనే ఉన్న ఇళ్లలోకి ప్రవహిస్తుంది. ప్రతి సంవత్సరం ఒక్కసారైనా ఈ వరద ముంపు ప్రభావం కొనసాగుతూనే ఉంది.

**ముంచెత్తుతున్న వరద**

నెమలపేట ఇళ్లలోని వరదనీరు చేరడంతో వీధుల్లో ఉన్న సీసీ రోడ్లు కూడా నీటిలో మునిగిపోతున్నాయి. ఇళ్ల వాకిళ్లలోకి ప్రవాహం చేరుతోంది. ఆయా రోజులంతా వంటావార్పు లేకుండా అలాగే వరద నీటిలో ఉండిపోవాల్సి వస్తోంది. దీనికితోడు వరదల వల్ల గ్రామస్తులు విష జ్వరాల బారిన పడి, తీవ్ర అనారోగ్యానికి గురికావడమే కాక ఆర్థికంగా నష్టపోతున్నారు. గ్రామంలో ఓ ప్రక్క ప్రహరీ లేని పాఠశాలలోకి కూడా వరద నీరు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు ఓ పాము వరదలో కొట్టుకుంటూ వచ్చి ఈ పాఠశాలలోకి చేరింది. ఇలాంటి ఘటనల మధ్య ఆ ప్రాంతవాసులు జీవనం సాగిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.